క్లుప్తంగా...

నేడు మంత్రి పర్యటన

మేడ్చల్‌రూరల్‌: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలో ఆదివారం మంత్రి మల్లారెడ్డి పర్యటించనున్నట్లు మున్సిపల్‌ బీఆర్‌ఎస్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ నరేందర్‌రెడ్డి తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని కండ్లకోయ, కేవీరెడ్డి నగర్‌, పలు వార్డుల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నట్లు ఆయన వివరించారు.

తహసీల్దార్‌కు సన్మానం

మేడ్చల్‌: మేడ్చల్‌ నూతన తహసీల్దార్‌ శైలజను మండల బీఆర్‌ఎస్‌ నాయకులు శనివారం సన్మానించారు. నూతనంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన ఆమెను కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ భాస్కర్‌ యాదవ్‌, మండల బీఆర్‌ఎస్‌ అధ్యక్షుడు దయానంద్‌యాదవ్‌ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఘనంగా దేవుని రాళ్ల గుట్ట జాతర



దేవుని రాళ్ల గుట్ట జాతరలో భక్తులు

మేడ్చల్‌: మండల పరిధిలోని నూతన్‌కల్‌ గ్రామంలో వెంకటేశ్వరస్వామి దేవుని రాళ్ల గుట్ట జాతరను శనివారం గ్రామస్తులు ఘనంగా జరుపుకున్నారు. గ్రామ శివార్లలోని గుట్టల్లో వెలిసిన వెంకటేశ్వరస్వామి ఉత్సవాలను ఏటా వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా గుట్టకు రంగులు వేసి అందంగా అలంకరించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ కవిత జీవన్‌, పీఏసీఎస్‌ చైర్మన్‌ సురేష్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో యూరియా, డీఏపీ

కీసర: కీసర పీఏసీఎస్‌ సొసైటీ కార్యాలయంలో డీఏపీ, యూరియా, జింక్‌, బ్లాక్‌ తార్పాలిన్లు అందుబాటులో ఉన్నాయని అవసరమైన రైతులు ఆధార్‌కార్డుతో పీఏసీఎస్‌ కార్యాలయంలో సంప్రదించాలని సొసైటీ చైర్మన్‌ రామిడి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

మున్సిపల్‌ సిబ్బందికి రెయిన్‌ కోట్‌ల పంపిణీ



రెయిన్‌కోట్‌లు పంపిణీ చేస్తున్న మున్సిపల్‌ చైర్మన్‌ చంద్రారెడ్డి తదితరులు

కీసర: నాగారం మున్సిపాలిటీలో విధులు నిర్వహించే పారిశుద్ధ్య, ఎలక్ట్రీషన్‌, వాటర్‌మెన్లకు వర్షకాలంలో ఇబ్బందులను ఎదుర్కొనేందుకు రెయిన్‌ కోట్‌లను శనివారం మున్సిపల్‌ చైర్మన్‌ చంద్రారెడ్డి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్‌ కమిషనర్‌ రాజేంద్రకుమార్‌, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మల్లారెడ్డి ట్రస్ట్‌ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



మందులు పంపిణీ చేస్తున్న మేయర్‌ కావ్య

జవహర్‌నగర్‌: మల్లారెడ్డి ట్రస్ట్‌ ఆధ్వర్యంలో సూర్యోదయ ఫౌండేషన్‌ నేతృత్వంలో శనివారం జవహర్‌నగర్‌ కార్పొరేషన్‌ జన్మభూమి నగర్‌లో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మేయర్‌ కావ్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జవహర్‌నగర్‌లో మల్లారెడ్డి ట్రస్ట్‌ సేవలు అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కుతాడి సాయికుమార్‌, జిట్టా శ్రీవాణి శ్రీనివాస్‌రెడ్డి, ట్రస్ట్‌ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న చైర్‌ పర్సన్‌ పావనీ జంగయ్య

ఘట్‌కేసర్‌: మున్సిపాలిటీ పరిధిలోని పదో వార్డులో రోడ్డు, భవనాల శాఖ నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు పనులు చైర్‌ పర్సన్‌ పావనీ జంగయ్య, స్థానిక కౌన్సిలర్‌ శశికళతో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో జంగయ్య యాదవ్‌, మాజీ వార్డు సభ్యుడు దేవేందర్‌ముదిరాజ్‌, రాంచందర్‌, స్థానికులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



మైనారిటీ బంధు చెక్కులు పంపిణీ చేస్తున్న మంత్రి మల్లారెడ్డి

సాక్షి, మేడ్చల్‌ జిల్లా: రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి కట్టుబడి ఉందని రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. బడుగు, బలహీనవర్గాలు, మైనార్టీల అభివృద్ధే లక్ష్యంగా అనేక పథకాలను అమలు చేస్తున్నామన్నారు. శనివారం జిల్లా కలెక్టరేట్‌ సమావేశ మందిరంలో జడ్పీ చైర్మన్‌ శరత్‌ చంద్రారెడ్డి, కలెక్టర్‌ అమయ్‌ కుమార్‌తో కలిసి ఆయన మైనారిటీ బంధు కింద అర్హులైన 497 మందికి రూ. లక్ష ఆర్థిక సాయానికి సంబంధించిన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు గొప్ప వ్యక్తిత్వం, మానవత్వం ఉన్నందునే మంచి ఆలోచనతో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి వాటిని అర్హులందరికీ అందేలా చేస్తున్నారన్నారు. మైనారిటీలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఎదిగేందుకు ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రతి నిరుపేదకు ఏదో ఒక సంక్షేమ పథకం వర్తించేలా చూడటమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. గత ప్రభుత్వాలు మైనారిటీలను కేవలం ఓటు బ్యాంకుగానే చూశాయని, వారి సంక్షేమానికి, ఆర్థిక ఎదుగుదలకు చర్యలు తీసుకోలేదన్నారు. జిల్లా పరిషత్‌ చైర్మన్‌ శరత్‌ చంద్రారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్‌ మైనార్టీల అభివృద్ధి, సంక్షేమానికి కట్టబడి ఉన్నారన్నారు. మైనారిటీల సంక్షేమం కోసం మైనారిటీ బంధు కింద రూ. లక్ష ఆర్థిక సాయం అందచేయటం అభినందనీయమన్నారు. జిల్లా కలెక్టర్‌ అమయ్‌ కుమార్‌ మాట్లాడుతూ జిల్లాలో 497 మంది మైనార్టీలకు రూ.లక్ష ఆర్థిక సాయం చెక్కులను అందజేస్తున్నామని, దశల వారీగా అర్హులైన వారందరికి ఈ పథకాన్ని వర్తింపజేస్తామన్నారు. ప్రభుత్వం అందించే ఈ ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు విజయేందర్‌రెడ్డి, అభిషేక్‌ అగస్త్య, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి ఖాసిమ్‌, కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

దివ్యాంగులమనే భావన రాకూడదు

దివ్యాంగులు తమకు వైకల్యం ఉందనే భావనను మనస్సులో నుంచి తొలగించి ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించేందుకు అందరితో సమానంగా కృషి చేయాలని రాష్ట్ర కార్మిక, ఉపాధికల్పన శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. ప్రభుత్వం వారికి చేయూతనిస్తూ భరోసా కల్పిస్తోందన్నారు. శనివారం జిల్లా కలెక్టరేట్‌లో మహిళా, శిశు, వికలాంగులు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ కార్యక్రమం కింద అర్హులైన 17 మంది దివ్యాంగులకు మోటరైజ్‌ వెహికిల్స్‌, బ్యాటరీ వీల్‌ చైర్లు, ల్యాప్‌టాప్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్‌ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి, జిల్లా కలెక్టర్‌ అమయ్‌ కుమార్‌ , జిల్లా అదనపు కలెక్టర్‌ విజయేందర్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ,జిల్లా సంక్షేమఅధికారి కృష్ణరెడ్డి స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు,వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

28 మందికి కారుణ్య నియామక పత్రాలు

కారుణ్య నియామకాల్లో భాగంగా ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగ నియామకాల పత్రాలను జిల్లా అదనపు కలెక్టర్‌ విజయేందర్‌రెడ్డి అందజేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం జిల్లా కలెక్టర్‌ అమయ్‌కుమార్‌ ఆదేశాల మేరకు శనివారం జిల్లా కలెక్టరేట్‌లో 28 మందికి ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

రెగ్యులరైజ్‌ చేసుకోండి



సాక్షి, మేడ్చల్‌ జిల్లా: జిల్లాలో పరిశ్రమలు, డ్రింకింగ్‌ వాటర్‌ ప్లాంట్స్‌, అపార్ట్‌మెంట్లు, ఆసుపత్రుల్లో బోర్‌ బావులకు బిగించిన డిజిటల్‌ వాటర్‌ ఫ్లో మీటర్లను రెగ్యులరైజ్‌ చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్‌ విజేందర్‌రెడ్డి అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో భూగర్భ జలాల వినియోగంపై జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని అందరూ ఉపయోగించుకోవాలని పర్మిషన్‌ లేని బోర్‌ బావులంటికి 30 రోజుల్లోగా రెగ్యులరైజ్‌ చేసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల అధికారి , జిల్లా కాలుష్య నియంత్రణ అధికారి, జిల్లా భూగర్భజల అధికారి ఆర్‌. దేవేంద్రప్రసాద్‌, మునిసిపల్‌ కమిషనర్లు , తహసీల్దార్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ధూమపానం ఆరోగ్యానికి హానికరం

సాక్షి,మేడ్చల్‌ జిల్లా: ధూమపానం , పొగాకు ఉత్పత్తుల ద్వారా ఊపిరితిత్తుల కేన్సర్‌, గుండె జబ్బులు, శ్వాసకోశ సమస్యలతో సహా ఆరోగ్యంపై అనేక రకాలుగా ప్రభావం పడుతుందని జిల్లా అదనపు కలెక్టర్‌ విజయేందర్‌రెడ్డి అన్నారు. శనివారం జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ధూమపానం, పొగాకు ఉత్పత్తులు మానేయడం ద్వారా పలు ప్రమాదాలను గణనీయంగా తగ్గించుకుని, ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవచ్చునన్నారు. సమావేశంలో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్‌ పుట్ల శ్రీనివాస్‌, మున్సిపల్‌ కమిషనర్లు, రెవెన్యూ అధికారులు , వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ

శామీర్‌పేట్‌: శామీర్‌పేట్‌ మండలంలోని తుర్కపల్లి, తుర్కపల్లి తండా గ్రామాల్లో శనివారం మంత్రి మల్లారెడ్డి పర్యటించారు. ఆయా గ్రామాల్లో సర్పంచ్‌,నాయకులతో కలిసి పాదయాత్ర చేపట్టారు. గ్రామాల్లో అసంపూర్తిగా ఉన్న సీసీ రోడ్లు, ఆలయాలను తన సొంత నిధులతో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం నాక్‌ ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ బీఆర్‌ఎస్‌ ఇన్‌చార్జ్‌ మహేందర్‌రెడ్డి, గ్రామ సర్పంచ్‌ కవిత వేణుగోపాల్‌రెడ్డి, ఉపసర్పంచ్‌ యూసుఫ్‌, ఎంపీపీ ఎల్లుబాయి, జెడ్పీటీసీ అనిత, బీఆర్‌ఎస్‌ రాష్ట్ర కార్యదర్శి జహంగీర్‌, డీసీఎంఎస్‌ వైస్‌ చైర్మన్‌ మధుకర్‌రెడ్డి, వైస్‌ ఎంపీపీ సుజాత, మండల బీఆర్‌ఎస్‌ అధ్యక్షులు సుదర్శన్‌, ఏఎంసీ వైస్‌ చైర్మన్‌ శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న మంత్రి మల్లారెడ్డి

అనురాగ్‌ యూనివర్సిటీలో ‘నా మట్టి నా దేశం’



మొక్కలు నాటుతున్న డీన్‌ విష్ణుమూర్తి, ఎన్‌ఎస్‌ఎస్‌ వలంటీర్లు

ఘట్‌కేసర్‌: వెంకటాపూర్‌ అనురాగ్‌ యూనివర్సిటీ (ఏయూ)లో ఎన్‌ఎస్‌ఎస్‌ యూనిట్‌ -3, 4 ఆధ్వర్యంలో శనివారం చేపట్టిన ‘నా మట్టి నా దేశం’ కార్యక్రమంలో భాగంగా యూనివర్సిటీ క్యాంపస్‌లో మొక్కలు నాటారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఇంజినీరింగ్‌ సీఎస్‌ఈ డీన్‌ విష్ణుమూర్తి, అడ్మిషన్స్‌ డైరెక్టర్‌ శ్రీనివాస రావు, ఎన్‌ఎస్‌ఎస్‌ సెల్‌ ప్రోగ్రామ్‌ కోఆర్డినేటర్‌ మల్లేశ్‌ వలంటీర్లతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యవరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్‌ పీఓలు మధుకర్‌, కిరణ్‌కుమార్‌, వలంటీర్లు పాల్గొన్నారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి



5 కె.రన్‌లో పాల్గొన్న ఆర్డీవో రాజేష్‌కుమార్‌ తదితరులు

కీసర: ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కీసర ఆర్డీవో రాజేష్‌కుమార్‌ అన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశానుసారం ‘ఐ ఓట్‌ ఫర్‌ ష్యూర్‌’ కార్యక్రమంలో భాగంగా కీసర అంబేద్కర్‌ చౌరస్తా నుంచి కీసర ఔటర్‌ రింగ్‌ రోడ్డు వరకు నిర్వహించిన 5కే రన్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఐదేళ్లకు ఓసారి జరిగే ఎన్నికల్లో ఓటు హక్కు ఉన్న వారందరూ తమ ఓటు హక్కును వినియోగించుకోని మంచి నాయకుడిని ప్రజాప్రతినిధిగా ఎన్నుకోవాలన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. ఈ మేరకు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 5కె రన్‌లో సీఐ వెంకటయ్య, తహసీల్దార్‌ అశోక్‌కుమార్‌, రెవెన్యూ, పోలీస్‌ సిబ్బంది, యువకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు

పోచారం: వార్డుకు రూ. 50 లక్షల చొప్పున 18 వార్డుల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు రూ. 9 కోట్లు కేటాయించినట్లు మున్సిపల్‌ చైర్మన్‌ బోయపల్లి కొండల్‌రెడ్డి తెలిపారు. శనివారం పోచారం మున్సిపల్‌ కౌన్సిల్‌ హాల్‌లో పాలక మండలి సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నారపల్లిలో వైకుంఠధామం నిర్మాణానికి రూ. 50 లక్షలు, ఎన్నికల నిర్వహణకు రూ. 5 లక్షలు, శానిటేషన్‌తో పాటు ఇతర ఖర్చులకు రూ. 60 లక్షలతో ప్రతిపాదనలను కౌన్సిల్‌ ఏకగ్రీవంగా ఆమోదించిందన్నారు. డ్రైనేజీ, తాగునీరు, పారిశుద్ధ్య నిర్వహణపై చర్చించామని, మున్సిపాలిటీ అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామన్నారు. సమావేశంలో వైస్‌ చైర్మన్‌ రెడ్యానాయక్‌, కమిషనర్‌ వేమనరెడ్డి, కౌన్సిల్‌ సభ్యులు చింతల రాజశేఖర్‌, బి.హరిప్రసాదరావు, నల్లవెల్లి లక్ష్మి, సామల శ్రీలత, బద్దం మమతారాణి, అబ్బవతిని సరిత, కోఆప్షన్‌ సభ్యులు, మున్సిపల్‌ అధికారులు పాల్గొన్నారు.

మా ఓఎస్డీ సార్‌.. మాకు కావాలి

తెలంగాణ స్పోర్ట్స్‌ స్కూల్‌ విద్యార్థుల నిరసన

శామీర్‌పేట్‌: మా ఓఎస్డీ సారు మాకు కావాలంటూ తెలంగాణ స్పోర్ట్స్‌ స్కూల్‌ విద్యార్థులు డిమాండ్‌ చేశారు. హకీంపేటలోని తెలంగాణ స్పోర్ట్స్‌ స్కూల్‌లో గత వారం బాలికలపై వేధింపులకు పాల్పడినట్లుగా ఆరోపణలు రావడంతో అధికారులు ఓఎస్డీ హరికృష్ణను సస్పెండ్‌ చేసిన విషయం తెలిసిందే.. తిరిగి ఆయనను విధుల్లో చేర్చుకోవాలని డిమాండ్‌ చేస్తూ శనివారం బాల బాలికలు తెలంగాణ స్పోర్ట్స్‌ స్కూల్‌ మెయిన్‌ గేట్‌ ఎదుట బైఠాయించి నినాదాలు చేశారు. సమాచారం అందుకున్న శామీర్‌పేట పోలీసులు వారిని సముదాయించి క్యాంపస్‌ లోపలికి పంపించారు.

పల్లె దవాఖానాలను సద్వినియోగం చేసుకోవాలి

కీసర: నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు పల్లె దవాఖానాలను సద్వినియోగం చేసుకోవాలని నాగారం మున్సిపల్‌ చైర్మన్‌ కౌకుట్ల చంద్రారెడ్డిఅన్నారు. శనివారం నాగారం మున్సిపాలిటీ పరిధిలోని నాగారం, రాంపల్లిలోని పల్లె దవాఖానాల్లో మెడికల్‌ ఆఫీసర్‌ సింధుజ ఆధ్వర్యంలో నిర్వహించిన జన ఆరోగ్య సమితి సమావేశం, హెల్త్‌మేళా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు వైద్య సేవలను మరింత చేరువ చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పల్లె దవాఖానాలను ఏర్పాటు చేసిందన్నారు. ఈ సందర్భంగా బీపీ, షుగర్‌, బాధితులకు అవసరమైన మందులను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. దవాఖానాల్లో సౌకర్యాల కల్పనకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

మేడ్చల్‌రూరల్‌: కుటుంబ కలహాల కారణంగా ఓ వ్యక్తి రైలు పట్టాలపై తలపెట్టి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మేడ్చల్‌లో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. వీకర్‌ సెక్షన్‌ కాలనీకి చెందిన శంకర్‌(45) మేడ్చల్‌ పారిశ్రామికవాడలోని స్లీప్‌వెల్‌ కంపెనీలో పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన అతను శనివారం ఉదయం సమీపంలోని రైలు పట్టాల వద్దకు వెళ్లి పట్టాలపై తలపెట్టి పడుకున్నాడు. అతడి తల మీదుగా రైలు వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

పోచారం: ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శనివారం పోచారం ఐటీసీ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ అశోక్‌రెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అన్నోజిగూడ, హనుమాన్‌నగర్‌కు చెందిన గుగులోతు దస్రు (35) ఆర్థిక ఇబ్బందుల కారణంగా శనివారం సాయంత్రం పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించిన పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తెలంగాణ ఖనిజ సంపదకు నిలయం

- మంత్రి మల్లారెడ్డి
- ఇంజినీరింగ్‌ కళాశాలలో జాతీయ సదస్సు ప్రారంభం



జాతీయ సదస్సును ప్రారంభిస్తున్న మంత్రి మల్లారెడ్డి

మేడ్చల్‌రూరల్‌: తెలంగాణ రాష్ట్రం అపారమైన ఖనిజ సంపదకు నిలయమని మంత్రి మల్లారెడ్డి అన్నారు. మైసమ్మగూడలోని మల్లారెడ్డి ఇంజినీరింగ్‌ కళాశాల(మెయిన్‌) లో ఖనిజాలు, జలవనరులు– సవాళ్లు, దృక్కోణం అంశంతో రెండు రోజుల పాటు కొనసాగనున్న జాతీయ సదస్సును మంత్రి మల్లారెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖనిజాలు, జలవనరులు రెండు సమ ప్రాధాన్యత కలిగిన అంశాలన్నారు. రాష్ట్రంలోని ఖనిజ సంపదకు కొదవలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కాళేశ్వరం, మిషన్‌ కాకతీయ,మిషన్‌ భగీరథ ప్రాజెక్టులపై వివరించారు. ఇలాంటి సదస్సులు విద్యార్థులు, అధ్యాపకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జియోలాజికల్‌ సర్వే ఆఫ్‌ ఇండియా అడిషనల్‌ డైరెక్టర్‌ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ దేశస్థూల దేశీయోత్పత్తికి ఖనిజాన్వేషణ రంగం మూడు శాతం వరకు తోడ్పడుతుందని, ఖనిజ వనరుల అన్వేషణలో జియోలజికల్‌ సర్వే ఆఫ్‌ ఇండియా పూర్తి సహకారాలు అందిస్తుందని తెలిపారు. ఖనిజాన్వేషణలో శాస్త్రీయ పద్ధతులను ఉపయోగించడం వల్ల పర్యావరణానికి వాటిల్లే ముప్పును గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. ఆర్‌వీ సముద్ర రత్నాకర్‌ పేరిట చేపట్టిన ప్రాజెక్ట్‌లో భాగంగా అరేబియా సముద్రజలాల్లో ఖనిజ లభ్యతపై అన్వేషిస్తున్నట్లు తెలిపారు. రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ దేశంలో ఖనిజ సంపద అధికంగా ఉందని దానిని సద్వినియోగం చేసుకునే అవకాశాలపై విద్యార్థులు, అధ్యాపకులకు అవగాహన కల్పించేందుకు ఇలాంటి సదస్సులు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్‌ రామస్వామిరెడ్డి, మల్లారెడ్డి గ్రూప్స్‌ అధ్యక్షులు భద్రారెడ్డి, ఇంజినీర్స్‌ అసోసియేషన్‌ ఇండియా కార్యదర్శి నరసయ్య, ఇండియన్‌ బ్యూరో ఆఫ్‌ మైన్స్‌ డైరెక్టర్‌ రంజన్‌ సహాయ్‌, మైనింగ్‌ అండ్‌ సేఫ్టీ డైరెక్టర్‌ నాగేశ్వర్‌రావు, కో ఆర్డినేటర్లు రాజగోపాల్‌, నారాయణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

‘ఆప్తమ్‌’ ఆధ్వర్యంలో హరితహారం



మొక్కలు నాటుతున్న దృశ్యం

ఘట్‌కేసర్‌: మున్సిపాలిటీలోని 1వ వార్డులో ఆప్తమ్‌ ఆర్గనైజేషన్‌ ఆధ్వర్యంలో శనివారం హరితహారం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన మున్సిపల్‌ చైర్‌ పర్సన్‌ పావనీజంగయ్య, వైస్‌ చైర్మన్‌ మాధవరెడ్డి, స్థానిక కౌన్సిలర్‌ వెంకట్‌ రెడ్డి ఆర్గనైజేషన్‌ సభ్యులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌ ఆంజనేయులుగౌడ్‌, ఎఫ్‌ఎస్‌సీఎస్‌ మాజీ డైరెక్టర్‌ ప్రభాకర్‌రెడ్డి, విశ్రాంత మిలిటరీ అధికారి కృష్ణమోహన్‌, మాజీ ఎంపీటీసీ రమేష్‌, అమర్‌దీప్‌, శ్రీధర్‌, నాయకులు చంద్రశేఖర్‌, కనకంభరావు, విజయ్‌గౌడ్‌, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి

కీసర: విద్యార్థులు ఇష్టపడి చదవాలని తమ విజయాలను ఇతరులతో పంచుకోవాలని వ్యక్తిత్వ వికాస నిపుణుడు, సినీ నటులు ప్రదీప్‌ అన్నారు. శనివారం నాగారం మున్సిపల్‌ పరిధిలోని రాంపల్లి కేజీఆర్‌ కళాశాలలో నిర్వహించిన ప్రేరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు తమకుతాము ప్రేరణను సృష్టించుకోవాలన్నారు. సమాజంలో ప్రముఖులందరూ ఒంటరిగానే ప్రయాణాన్ని సాగించారని, అధైర్య పరిచే వ్యక్తులను, చిన్న లోపాలను వదిలేసి బలమైన వ్యక్తిత్వాన్ని మాత్రమే ఆసరాగా తీసుకోవాలన్నారు. కళాశాల డైరెక్టర్‌ ప్రొఫెసర్‌ పి.వి. రమణారావు మాట్లాడుతూ విద్యార్థి అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా ప్రతి నెల నిపుణులతో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్‌ డాక్టర్‌.కె. గోవింద్‌రెడ్డి, కళాశాల సెక్రటరీ కె.నితిన్‌రెడ్డి, ప్రిన్సిపాల్‌ ఎస్‌. విజయలక్ష్మి, ప్రొఫెసర్‌ విజయ్‌ కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్‌ డే

మేడ్చల్‌రూరల్‌: పోటీ ప్రపంచంలో విద్యార్థులు నిత్య విద్యార్థిగా మెలగాలని అప్పుడే జీవితంలో ఎన్నో నేర్చుకోవచ్చని జేఎన్‌టీయూహెచ్‌ ఎగ్జామినేషన్స్‌ డైరెక్టర్‌ వెంకటేశ్వరరావు అన్నారు. మైసమ్మగూడలోని సెయింట్‌ పీటర్స్‌ ఇంజినీరింగ్‌ కళాశాలలో శనివారం 13వ గ్రాడ్యుయేషన్‌ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు. ఉత్తమ విద్యార్థులను సత్కరించారు. అనంతరం మెగా ఇంజినీరింగ్‌ అండ్‌ ఇన్ఫ్రా డైరెక్టర్‌ రవి రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగంలో జవాబుదారీతనం ఉండాలన్నారు. అంతర్గత నైపుణ్యాలు ఉంటేనే బహుళ జాతి కంపెనీల్లో అవకాశాలు దక్కుతాయన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్‌ బాలరెడ్డి, కార్యదర్శి టీవీ రెడ్డి, ప్రిన్సిపాల్‌ శ్రీలత, అకాడమిక్‌ డైరెక్టర్‌ సరోజారెడ్డి, డైరెక్టర్లు అనురాగ్‌రెడ్డి, రాజేశ్వర్‌, పీఆర్వో రవిసుధాకర్‌, అధ్యాపకులు,విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉద్యోగావకాశాలపై సదస్సు



ఫ్లెక్సస్‌ క్లబ్‌ను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్‌ అశోక్‌

మేడ్చల్‌రూరల్‌: మైసమ్మగూడలోని ఎమ్మార్‌సీఈ కళాశాలలో ఫేస్‌ ప్రెప్‌ సంస్థ ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో లింక్‌డ్‌ ఇన్‌ కెరీర్‌ ప్రోగ్రాం ద్వారా వివిధ కోర్సులకు సంబంధించిన ఉద్యోగాలను సాధించడంపై వివరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్‌ అశోక్‌ విద్యార్థులకు కెరీర్‌ ప్లానింగ్‌ పై అవగాహన కల్పించారు. లింక్‌డ్‌ ఇన్‌ కెరీర్‌ ప్రోగ్రాంలో సభ్యత్వం తీసుకున్న విద్యార్థులకు 6 నెలల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ నిర్వాహకులు తెలిపారు.

ఫ్లెక్సస్‌ క్లబ్‌ ఆవిష్కరణ...

మల్లారెడ్డి కాలేజ్‌ ఆఫ్‌ ఇంజినీరింగ్‌(ఎమ్మార్‌సీఈ)లో బీటెక్‌ ఆర్టిఫిషియల్‌ ఇంటలిజెన్స్‌ విభాగానికి చెందిన విద్యార్థులు కృత్రిమ మేధకు సంబంధించిన ఫ్లెక్సస్‌ క్లబ్‌ను ప్రిన్సిపాల్‌ అశోక్‌ ప్రారంభించారు. క్లబ్‌ అధ్యక్షుడిగా ఎన్నికైన బెంజిన్‌ క్లబ్‌ కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమావేశానికి హాజరుకాని అధికారులపై చర్యలు



ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు




సమావేశంలో పాల్గొన్న ఎంపీపీ, తదితరులు

మేడ్చల్‌: గ్రామాలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించేందుకు మూడు నెలలకొకసారి నిర్వహించే మండల పరిషత్‌ సాధారణ సర్వసభ్యసమావేశానికి అధికారులు గైర్హాజరు కావడంపై మండల సభ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి అధ్యక్షతన శనివారం జరిగిప మండల సర్వసభ్య సమావేశానికి 9 శాఖల అధికారులు హాజరుకాలేదు. దీంతో సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశాలకు రాకుండా అధికారులు మండల పరిషత్‌ ను అవమానిస్తున్నారని వారిపై కలెక్టర్‌కు లేఖ రాసి చర్యలకు సిఫారసు చేస్తామన్నారు.

సమావేశంలో ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి, వైస్‌ ఎంపీపీ వెంకటేషం, జెడ్పీటీసీ శైలజ విజయానంద రెడ్డి, జిల్లా పరిషత్‌ కో ఆప్షన్‌ సభ్యుడు గౌస్‌, సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు విజయానంద రెడ్డి, మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ భాస్కర్‌ యాదవ్‌ , ఎంపీడీఓ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

చెత్తను స్వచ్ఛ ఆటోలకే అందజేయాలి

కీసర: నాగారం మున్సిపాలిటీలో పరిధిలోని వివిధ కాలనీల ప్రజలు చెత్తచెదారాన్ని ప్రతిరోజు తమ ఇంటి సమీపంలోకి వచ్చే స్వచ్ఛ ఆటోలకు అందజేయాలని మున్సిపల్‌ చైర్మన్‌ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని నేతాజీ నగర్‌కాలనీలో పర్యటించిన ఆయన కాలనీ రహదారి వెంట పేరుకు పోయిన చెత్తను జేసీబీ సహాయంతో తొలగింపజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో చెత్తను పారవేస్తే రూ 100 జరిమానా విధి స్తామన్నారు.



కార్యక్రమంలో సానిటరీ ఇన్‌స్పెక్టర్‌ రాంరెడ్డి, ఎన్విరాన్మెంట్‌ ఇంజినీర్‌ మున్సిపల్‌ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.